రోడ్డు మరమ్మతులపై నిర్లక్ష్యం

- లలితాపురం వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గోతులు
- రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



అడుగడుగునా ఇలాంటి పెద్దపెద్ద గుంతలే..

ఇల్లెందురూరల్: ఆ మార్గంలో వెళ్లడం సాహసోపేతమే.. పెద్దపెద్ద గోతులు ప్రమాదాలను పిలిచినట్లుగా ఉంటాయి. వేగంలో నియంత్రణ కొరవడితే వాహనం పల్టీల కొట్టాల్సిందే. ఇక భారీ వాహనాలైతే ఈ మార్గంలో వెళ్లేటప్పుడు అందులో ఉన్న వారు ఊయ్యాలూగుతున్న అనుభూతి. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు మరమ్మతు చేయించాలన్న ఆలోచన రాకపోవడం గమనార్హం.

కేవలం 50 మీటర్ల దూరమే..

ఇల్లెందు నుంచి ఖమ్మం వెళ్లే మార్గంలో సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో లలితాపురం గ్రామ సమీపంలో కేవలం 50 మీటర్ల దూరం అధ్వానంగా ఉంది. వర్షం కురిసినప్పుడు వరద రోడ్డు మీదకు చేరడం, ఆ మార్గంలో వాహనాల రద్దీ అధికంగా ఉండటం వంటి కారణాలతో అధ్వానంగా ఉన్న రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆయా గుంతలు కేవలం 50 మీటర్ల దూరం మాత్రమే ఉన్నప్పటికీ గుంతలు పూడ్చేందుకు సంబంధిత అధికారులు కనీస ప్రయత్నం చేయకపోవడం విచారకరం.

శాశ్వత ప్రాతిపదికన పనుల పేరుతో..

హైదరాబాద్ నుంచి కొత్తగూడెం వరకు జాతీయ రహదారి లలితాపురం సమీపం గుండా వెళ్తుంది. జాతీయ రహదారి వెళ్లే మార్గం లలితాపురం గ్రామ సమీపంలో అధ్వానంగా ఉన్న ఆ రహదారి మీదుగా వెళ్తుంది. దీంతో ఎలాగూ నేషనల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావించిన అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వ హయాంలో సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన కూడా చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

వేగంగా వెళ్తే ప్రమాదమే..

సుభాష్‌నగర్ పంచాయతీ పరిధిలో సుభాష్‌నగర్, లలితాపురం గ్రామాల మీదుగా ఇల్లెందు – ఖమ్మం రహదారి ఉంది. లలితాపురం గ్రామంలో.. సుభాష్‌నగర్ గ్రామ సరిహద్దుల వరకు మాత్రమే వీధిదీపాలు ఏర్పాటు చేశారు. మధ్యలో సుమారు అరకిలోమీటరు దూరంలో వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ అంధకారం నెలకొంటుంది. లలితాపురం గ్రామ శివారులోని రహదారి



గుంతల్లో వెళ్తున్న వాహనాలు

అధ్వానంగా ఉన్న ప్రాంతం కూడా అంధకారం నెలకొన్న ప్రాంతంలోనే విస్తరించి ఉంది. పగటి పూటే ప్రమాదాలు జరుగుతున్నాయంటే ఇక రాత్రిపూట వాహన చోదకుల పరిస్థితి చెప్పనక్కరలేదు. ప్రతీరోజు జరుగుతున్న ప్రమాదాల బారినపడి ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు కాళ్లు, చేతులు విరిగిన సంఘటనలు ఉన్నాయి. అదృష్టం ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడుతున్నారు. మొత్తంగా ఈ మార్గంలో ప్రయాణించడం యమ డేంజర్ అని వాహచనోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు.

రోజుకో ప్రమాదం జరుగుతోంది...



మాది రాఘబోయినగూడెం గ్రామం. ఏ పని ఉన్నా లలితాపురం మీదుగానే ఇల్లెందుకు చేరుకుంటాం. గ్రామ సమీపంలో రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గోతులు రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ప్రతీరోజు ఎవరో ఒకరు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– బండి సుధాకర్, రాఘబోయినగూడెం

వచ్చిన డబ్బు రిపేర్లకే..



టాటా ఏసీ వాహనం నడపడం ద్వారా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రతీరోజు లలితాపురం మీదుగా ఖమ్మంకు రాకపోకలు సాగిస్తుంటాం. కేవలం 50 మీటర్ల దూరమే అధ్వానంగా ఉన్నప్పటికీ వాహనం మరమ్మతులకు గురవుతోంది. ఒక్కరోజులో వచ్చిన ఆదాయం మరమ్మతులకే సరిపోతోంది.

– రామకృష్ణ, డ్రైవర్, సుదిమళ్ల

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం..

లలితాపురం గ్రామం వద్ద రహదారి అధ్వానంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ కారణంగానే సుభాష్‌నగర్ నుంచి లలితాపురం వరకు మంజూరైన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పై అధికారులకు కూడా నివేదిక ఇచ్చాం. ఆదేశాలు రాగానే త్వరలోనే రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– మోతీలాల్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఇల్లెందు మండలం

చర్చలు విఫలం.. సమ్మె కొనసాగింపు

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులు, యూనియన్లతో మున్సిపల్ కమిషనర్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. యథాతదంగా సమ్మె కొనసాగించారు. రెండోరోజు కూడా ఆందోళన, నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, పీఆర్సీ ఏరియర్స్, 25 నెలల పెండింగ్ పీఎఫ్ కోసం, మేడే కానుక బకాయిలు, ఎస్ఎంఆర్, రిక్షా కార్మికుల పీఎఫ్, రెండు నెలల వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ ఆధ్వర్యంలో అధికారులతో మున్సిపల్ కార్మికులు, కార్మిక సంఘం ప్రతినిధులు యాకుబ్‌షావలీ, టి.కృష్ణ, నాయిని కృష్ణ, భారతీ, భూలక్ష్మి, ఉమ, చుక్కా రాంచందర్, సంజీవ్‌లతో చర్చలు జరిపారు. ఆందోళన విరమించాలని, నిధులు సమకూరిన తర్వాత అన్ని పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామని, సోమవారం జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి రాత పూర్వకంగా మున్సిపాలిటీ స్థితిగతులపై నివేదిక అందజేస్తామని కమిషనర్ వివరించారు. దీనివల్ల మరింత జాప్యం జరుగుతుందని కార్మిక సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు


చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: పీడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు.

మాట్లాడుతూ.. జూలూరుపాడు హైస్కూల్‌లో పీడీ అరుణకుమారి 6వ తరగతి విద్యార్థినిని అకారణంగా కొట్టడం సరైంది కాదన్నారు. గతంలో కూడా పీడీపై అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పీడీపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు భీష్మించుకొని కూర్చున్నారు. హెచ్ఎం లక్ష్మీనర్సయ్య నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది.

విషయం తెలుసుకున్న ఎంఈఓ గుగులోత్ వెంకట్ సంఘటనా స్థలానికి చేరుకొని, విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గుగులోత్ వంశీ, జమ్మి యశ్వంత్, పవన్, బాలాజీ, పి.పవన్, బోడా అభిమిత్ర తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ




శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ టీచర్లు

టేకులపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని ఐసీడీఎస్ సీడీపీఓ కేఎం తార, ఎంపీడీఓ గడదాసు రవీందర్‌రావు సూచించారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజులు ఇవ్వనున్న శిక్షణ మండలంలోని వెంకట్యాతండా కేంద్రంలో శుక్రవారం ప్రారంభమైంది. సీడీపీఓ, ఎంపీడీఓ మాట్లాడుతూ.. 3–6 ఏళ్ల చిన్నారులకు బోధించే అంశాలు, ఆటపాటలతో శారీరక, మానసిక ఎదుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. తొలిరోజు శిక్షణకు 40 మంది అంగన్‌వాడీ టీచర్లు హాజరు కాగా మాస్టర్ ట్రెయినీలు కవిత, శారద, సూపర్‌వైజర్లు అనురాధ, లక్ష్మి, సక్కుబాయి, నిర్మల పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడాలి

పాల్వంచ: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని, ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక కేటీపీఎస్ సీతారామ కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలను పాకాలపాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటకోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలను కొత్వాల ప్రారంభించారు. మాట్లాడుతూ... భారతదేశం కళలకు ప్రసిద్ధి అన్నారు. మన ఆచారాలు గొప్పవని, వాటిని వచ్చే తరాలు కూడా మర్చిపోకుండా కొనసాగించేందుకు ఇలాంటి ఉత్సవాలను నిర్వహిస్తుండటం పట్ల కళాకారులను అభినందించారు. ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం కళాకారులను ప్రొత్సహిస్తోందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపకులు పాకాలపాటి రోశయ్య చౌదరి, కొండం వెంకన్న, యర్రంశెట్టి ముత్తయ్య, సాధం రామకృష్ణ, మధు, ఎన్‌పి.నాయుడు, వై.వెంకటేశ్వరరావు, బాషా, శ్రీపాద సత్యనారాయణ, పాతూరి రామ్మోహన్ రెడ్డి, మోహన్, కాల్వ విజయ్, బొల్లం రాంబాబు, మూడ్ లక్ష్మణ్, కేశోతు కృష్ణ, ఎండీ.మంజూరు, రవి, బొల్లం భాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

గోర్ బంజారా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

జూలూరుపాడు: జూలై 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరగనున్న గోర్ బంజార జాతీయ సమ్మేళనం, లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని నిర్వాహణ కమిటీ కోకన్వీనర్, న్యాయవాది బానోత్ రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు హాజరు కావాలని కోరుతూ నాయకులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను శుక్రవారం జూలూరుపాడులో కలిసి కరపత్రం అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆంగోత్ భాస్కర్, మోహన్‌నాయక్, బోడా కృష్ణ, అరుణ్ పాల్గొన్నారు.

టేకులపల్లి సంత వేలం రూ.8.31 లక్షలు

టేకులపల్లి: టేకులపల్లి, గోలియాతండా గ్రామ పంచాయతీలు సంయుక్తంగా నిర్వహించే సంత నిర్వహణను అప్పగించేందుకు శుక్రవారం వేలం జరిగింది. టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీఓ గణేష్ గాంధీ అధ్యక్షతన నిర్వహించగా వేలంలో పలువురు పాల్గొనగా రూ.8.31లక్షలకు మూడ్ వాసు కైవసం చేసుకున్నాడు. కాగా, గత ఏడాది రూ.11.81లక్షల ఆదాయం రాగా ఈసారి రూ.8.31లక్షలే రావడంతో గ్రామపంచాయతీలకు రూ.3.50లక్షల ఆదాయం తగ్గింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎల్.కిరణ్, సిబ్బంది మూడ్ బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

టేకులపల్లి: టేకులపల్లిలోని గిరిజన బాలికలు, బాలుర కళాశాల వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్లు భరత్, కల్యాణి వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. ఇంటర్, డిగ్రీ చదివే గిరిజన బాలురు, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు బాలికలు 96522 50135, బాలురు 63009 62365 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కనీస వేతనం ఇవ్వండి..

జూలూరుపాడు: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారని, చాలీచాలనీ వేతనంతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.600 ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షలు అందించాలన్నారు. కార్యక్రమంలో కంగాల వెంకటమ్మ, బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, కృష్ణయ్య, కృష్ణారావు, బాబు, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం కావాలి..

ఇల్లెందు: ఆటోడ్రైవర్లు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడమే కాక ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా వ్యవహరించాలని సీఐ బత్తుల సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లతో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. నంబర్ ప్లేట్ లేకుండా, లైసెన్స్ తీసుకోకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్‌కుమార్, ఆటో డ్రైవర్లు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు. కాగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ సత్యనారాయణను బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఏపీ.ప్రసాద్, కె.సమ్మయ్య, గోచికొండ సత్యనారాయణ, కొడారి రాజేందర్, ఎస్.నాగేశ్వరరావు, ఐలయ్య, పందిళ్ల వెంకటేశ్వర్లు, కోడి రాజేందర్, జగన్నాథం శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి..

కొత్తగూడెంఅర్బన్: ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై కె.నరేష్ సూచించారు. ఆటోడ్రైవర్లకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు ఆటోడ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రమాదాలు జరిగినప్పుడు సామాజిక బాధ్యతగా క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించాలని తెలిపారు.



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారాయణ

గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఇద్దరితో పాటు ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, డెయిరీ సైన్స్‌ల్లో ఒక్కో అధ్యాపకుడిని నియమిస్తామని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని, నెట్, సెట్ పీహెచ్‌డీతో పాటు బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు జూలై 1వ తేదీ సాయంత్రం 4గంటల లోపు దరఖాస్తు చేసుకుని, 2వ తేదీ ఉదయం జరిగే డెమో, ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, వివరాలకు 99082 22961 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

జిల్లా ఆస్పత్రి వద్ద వైద్యుల నిరసన

కొత్తగూడెంరూరల్: నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో వైద్యులపై అజమాయిషీ చేసేందుకు అక్కడి కలెక్టర్ డాక్టర్ల కంటే తక్కువ స్థాయి వ్యక్తిని నియమించడాన్ని నిరసిస్తూ కొత్తగూడెం జిల్లా సర్వజన ఆస్పత్రి వద్ద వైద్యులు శుక్రవారం నిరసన తెలిపారు. ఆస్పత్రుల్లో సౌకర్యాలు లేకుండా వైద్యులపై ఒత్తిడి తీసుకరావడం సరికాదన్నారు. వైద్యులు సురేందర్, ఉమామహేశ్వరరాజు, నవదీప్, పుష్పలత, సరిత, సందీప్, సంతోష్, ప్రవీణ్, సౌమ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వైద్యులు

విలీన ఉద్యోగులను జూనియర్లుగా గుర్తించండి..

ఇల్లెందు: గత ప్రభుత్వం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఓలను వివిధ శాఖలలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లుగా సూపరింటెండెంట్ పోస్టులలో సర్దుబాటు చేసింది. అయితే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వారి సీనియారిటీని ఖరారు చేస్తూ జాబితా విడుదల చేసింది. మున్సిపాలిటీలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు ఆ జాబితా చూసి లబోదిబోమంటున్నారు. ఎన్నో ఏళ్లుగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న తాము ఏడాది క్రితం తమ శాఖలో సర్దుబాటు అయిన వీఆర్‌ఓల వల్ల తమ సీనియారిటీ అత్యంత వెనకకు వెళ్లిందని ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీలో సర్దుబాటు చేసిన రోజు వారికి ఎలాంటి సర్వీసు రూల్స్ లేకుండా హోదా నిర్ధారించకుండా సర్దుబాటు చేసి ఇటీవల వారిని సీనియర్లుగా తమను జూనియర్లుగా నిర్ధారించటం వల్ల తమ సీనియారిటీ కోల్పోవాల్సి వస్తోందని మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 20 ఏళ్లుగా సీహెచ్ రాజేశ్వరరావు అనే ఉద్యోగి జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఏడాది క్రితం వచ్చిన వీఆర్‌ఓలు అదే జూనియర్ అసిస్టెంట్ పోస్టులో కొంతమంది సర్దుబాటు అయ్యారు. వారంతా సర్వీసులో ముందుకు వెళ్లిపోయారని, వారికి ప్రమోషన్స్ ముందు తమకు వెనుక వచ్చే విధంగా వారి సీనియారిటీని నిర్ధారించినట్లు రాజేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చాలామంది ముందు నుంచి వెనక్కి వెళ్లిపోయి సర్వీసు నష్టపోతున్నామని తక్షణం ప్రభుత్వం ముందు నుంచి ఉన్న వారి తర్వాత వీఆర్‌ఓల సర్వీసును లెక్కించాలని కోరారు. తమకు అన్యాయం చేయవద్దన్నారు.

'స్వయం ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం దుర్గారావు

ఇల్లెందురూరల్: స్త్రీనిధి ద్వారా మంజూరయ్యే స్వయం ఉపాధి యూనిట్లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం దుర్గారావు సూచించారు. మండలంలోని సెర్ప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనిట్‌కు రూ.1.13 లక్షలు చొప్పున 29 గ్రామసంఘాలకు 175 యూనిట్లు, ఆరు మహిళా స్టిచ్చింగ్ సెంటర్లలో సామగ్రి కొనుగోలు కోసం రూ.33లక్షలు, యూనిట్‌కు రూ.93,200 చొప్పున 32 పాడిగేదెల యూనిట్లు, 50 కోడిపిల్లలతో 176 పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు, ఎనిమిది మందికి యూనిట్ చొప్పున మండల సమాఖ్య క్యాంటిన్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కాగా, పొదుపు సంఘాల సభ్యులకు బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌ఎం శ్యాంసుదర్, ఉద్యోగులు నాగేంద్ర, సంపత్, రాంబాబు, నర్సింహారావు, రామ్మూర్తి, లాలయ్య, స్వర్ణలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, కోశాధికారి సౌజన్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో విరివిగా మొక్కలు నాటాలి

ఇల్లెందురూరల్: వచ్చేనెల మొదటి వారంలో మొదలు కానున్న వన మహోత్సవంలో భాగంగా ప్రతీ పాఠశాలలో విరివిగా మొక్కలు నాటాలని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, నోడల్ అధికారి టీవీఆర్ఎస్ స్వామి సూచించారు. సుభాష్‌నగర్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేలా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు, బడిబాట నిర్వహణపై సూచనలు చేశారు. హెచ్ఎం రాంబాబు, సుధాకర్, ఉమాశంకర్, యాదమ్మ పాల్గొన్నారు.

బొగ్గు వేలం సంస్థ మనుగడకే ప్రమాదం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు బ్లాకుల వేలంపై రాజకీయం సింగరేణి సంస్థ మనుగడకే ప్రమాదమని, చట్టబద్ధమైన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలని ఏబీకేఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది నాయకులు రాజకీయ లబ్ధి కోసం, సింగరేణి మనుగడను తాకట్టు పెట్టేందుకు కుటీల యత్నం చేస్తున్నారని, దీనివలన యువత భవిష్యత్ ప్రశ్నార్థకం కానుందని, వారి జీవితాలతో ఆటలాడుకోవద్దన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వేలంలో పాల్గొని బొగ్గు గనులను సాధించుకోవాలన్నారు. అనంతరం వివిధ యూనియన్ల నుంచి బీఎంఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ పవన్‌కుమార్, కృష్ణారెడ్డి, జీ.వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాస్, ఊట్ల గణేష్, మొగిలిపాక రవి, వి.నాగప్రసాద్, బి.రాంసింగ్, నాగేశ్వరరావు, డి.నిర్మల, ఎం.మోహన్, తారచందు, ఠాకూర్, సాంబమూర్తి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ నటరాజ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించడం సిగ్గుచేటన్నారు. కోల్ ఇండియా, సింగరేణి సంస్థకు బొగ్గు గనులను కేటాయించాలన్నారు. కేంద్రం ఇప్పటికే తొమ్మిది రౌండ్లలో 107 బ్లాకులను వేలం వేసిందన్నారు. కార్యక్రమంలో మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, కొలగాని బ్రహ్మాచారి, కారం పుల్లయ్య, నర్సారెడ్డి, బాలరాజు, శ్రీనివాస్, సత్యనారాయణ, దొడ్డా రవికుమార్, భూక్యా రమేష్ పాల్గొన్నారు.



పాల్వంచ: నటరాజ్ సెంటర్‌లో మానవహారం చేపట్టిన సీపీఎం నాయకులు

క్లుప్తంగా

పీవీ జయంతి వేడుకలు

పాల్వంచ: భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో సైతం చాటిన మహోన్నత వ్యక్తి మాజీ దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్వాల మాట్లాడారు. యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, సాధం రామకృష్ణ, యర్రంశెట్టి మధు పాల్గొన్నారు.

నేడు సహకార సంఘం సమావేశం

జూలూరుపాడు: శనివారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు సహకార సంఘం సీఈఓ రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో రైతు బంధు పథకంపై రైతుల సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందని, సహకార సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

డిజిటల్ ఎక్స్‌రే మంజూరు చేయాలని వినతి

పాల్వంచరూరల్: పాల్వంచ ఏరియా ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్, సీఏఆర్ఎం యంత్రాన్ని మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ కోరారు. అలాగే, ఆర్థోపెడిక్ వైద్యుడిని నియమించాలనికోరుతూ హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాకు వినతిపత్రాన్ని అందజేశారు.

వితరణ

జూలూరుపాడు: జూలూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన పోతురాజు మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, సామగ్రిని కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మోదుగు సుగుణరావు, పోతురాజు నాగరాజు, మోదుగు రామకృష్ణ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సుకృత మాట్లాడుతూ.. ప్రతీ ఆస్పత్రి, ల్యాబ్, క్లినిక్ ఫిజియోథెరపీ ఆయుష్, సిద్ధ, యూనానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేదంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మాదిగల కవాతును విజయవంతం చేయండి

పాల్వంచ: జూలై 7న వరంగల్‌లో నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమన్వయ కమిటీ కన్వీనర్ నల్లగట్ల వెంకన్న మాదిగ, కోకన్వీనర్ వంగూరి రామ్మూర్తి కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ కోసం 1994లో మందా కృష్ణమాదిగ ప్రారంభించిన ఉద్యమం జూలై 7వ తేదీ నాటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ కవాతుకు పిలుపు నివ్వడం జరిగిందన్నారు.

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి

ఇల్లెందు: పదిహేనేళ్ల తర్వాత ప్రకటించిన ఉద్యోగ నోటిఫికేషన్లు పొరపాట్లు జరగకుండా చూడాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు హరీష్‌గౌడ్ ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రూప్–1 కేటగిరిలో 1:100కు పెంచాలని, డీఎస్సీ జూలై 17 – 30 వరకు జరిగే పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఆగస్టులో పరీక్షలు నిర్వహించటం వల్ల రెండు పరీక్షలకు హాజరయ్యే వారికి సమయం సరిపోదన్నారు. దీంతో పరీక్ష రాసే అవకాశం కోల్పోతారని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ జితేష్ వి.కుమార్ పాటిల్‌ను శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, పీసీసీ సభ్యుడు నాగా సీతారాములు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చింతిర్యాల రవి, దేవీప్రసన్న, జయప్రకాష్, ఏనుగుల అర్జున్‌రావు, రౌతు నరసింహారావు, బొబ్బల వెంకట్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన భూపేష్..

కొత్తగూడెంటౌన్: ఎస్పీ రోహిత్‌రాజును శుక్రవారం ప్రపంచ పర్యావరణ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల భూపేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్న విషయాన్ని వివరించారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

కొత్తగూడెంఅర్బన్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి జాబ్ మేళాలు అంటూ నిరుద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.